సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 15 । మే । 2025



భూసార పరీక్షలేవి..?

జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు నాలుగేళ్లుగా భూసార పరీక్షలు నిర్వహించకపోవడంతో పంటల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. 8లో



భారీ వర్షం..

జిల్లాలోని పలు గ్రామాల్లో అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని రక్షించేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 27°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పుష్కరాలకు నేటి నుంచి ప్రత్యేక బస్సులు

చుంచుపల్లి: సరస్వతి నది పుష్కరాల సందర్భంగా కొత్తగూడెం డిపో నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం దేవేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ప్రతీ రోజు ఉదయం 6 గంటలకు కొత్తగూడెం బస్టాండ్ నుంచి బయలుదేరి.. ఇల్లెందు, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, భూపాలపల్లి, మహదేవపూర్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు కాళేశ్వరం చేరుకుంటుందని, తిరిగి అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి అదే మార్గంలో కొత్తగూడెం వస్తుందని వివరించారు. ఈ ఎక్స్‌ప్రెస్ బస్సులో పెద్దలకు చార్జీ రూ. 580, పిల్లలకు రూ.300గా నిర్ణయించామని, ముందుగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు డిపో మేనేజర్ కొత్తగూడెం 99592 25959, బస్టాండ్ ఎంక్వైరీ 99592 25982, రిజర్వేషన్ కౌంటర్, 99592 25981 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీసీ ప్రథమ్ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కోర్సుల వారీగా పది రోజుల నుంచి 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని, బ్యూటీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, టైలరింగ్ శిక్షణ కోసం పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. పుట్టగొడుగుల పెంపకం శిక్షణకు ఏడో తరగతి, ఆపైన, జ్యూట్ బ్యాగ్‌ల తయారీకి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని వెల్లడించారు. భద్రాచలం, ఖమ్మం వైటీసీల్లో శిక్షణ ఇవ్వడమే కాక ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని పీఓ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత పత్రాలు, కుల ధ్రువీకరణ జిరాక్స్, ఆధార్, రేషన్ కార్డు/ఉపాధి హామీ బుక్, బ్యాంకు పాస్ బుక్, రెండు ఫొటోలతో ఈనెల 21న ఐటీడీఏలోని వైటీసీలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 63026 08905, 81438 40906 నంబర్లలో సంప్రదించాలని పీఓ తెలిపారు.

నేటితో ముగియనున్న వేసవి శిబిరం



అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్న బాలికలు

పాల్వంచరూరల్ : ఉళ్లపల్లిలోని బాలికల క్రీడా పాఠశాలలో ఈనెల 1న ప్రారంభించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం గురువారంతో ముగియనుందని ఐటీడీఏ క్రీడా శాఖాధికారి గోపాల్‌రావు తెలిపారు. ప్రత్యేక కోచ్‌లను నియమించి 72 మంది బాలురు, 72 మంది బాలికలకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇప్పించామని పేర్కొన్నారు. కాగా, ప్రతి సంవత్సరం పాల్వంచ మండలం కిన్నెరసానిలోని క్రీడా పాఠశాలలో నెల రోజుల పాటు ఈ శిబిరాలు నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది మాత్రం 15 రోజులకే పరిమితం చేశారు.

ఉపాధ్యాయ శిక్షణను పరిశీలించిన ఆర్‌జేడీ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల హాజరు, శిక్షణపై ఆరా తీశారు. అనంతరం ఆర్‌జేడీ మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా బోధించాల్సి ఉంటుందని తెలిపారు. ఖమ్మం డీఈఓ ఎస్.సత్యనారా యణ, ఏఎంఓ రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ, కోర్సు కోఆర్డినేటర్ శైలజలక్ష్మి పాల్గొన్నారు. కాగా, ఖాళీగా ఉన్న గెజిటె డ్ ప్రధానోపాధ్యాయుల పోస్టుల్లో ఎఫ్‌ఏసీ హెచ్‌ఎంలుగా నియమించిన స్కూల్ అసిస్టెంట్లకు ర్యాటిఫికేషన్ ఆర్డర్లు ఇవ్వాలని ఆర్‌జేడీకి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కట్టా శేఖర్‌రావు, పి.వెంకటేశ్వర్‌రెడ్డి, తాళ్లూరి చంద్రశేఖర్, రత్నకుమార్, డి.రవికుమార్, లింగం సతీష్, టి.వెంకన్న, కాంతారెడ్డి, మహేష్, రవికిరణ్, సుబ్బారావు పాల్గొన్నారు.

జిల్లాకు రిక్తహస్తమే..!



ఆ లైన్ల ఊసేలేదు..

గిరిజన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఛత్తీస్‌గఢ్, ఏపీ మీదుగా భద్రాచలం (పాండురంగాపురం) రైల్వేలైన్ నిర్మాణానికి ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ మార్గానికి సంబంధించి భద్రాచలంరోడ్ – మణుగూరు సెక్షన్‌లో పాండు రంగాపురం నుంచి భద్రాచలం వరకు 15 కి.మీ. మార్గం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వస్తుంది. అయితే ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వేకు చూపించిన కేటాయింపుల్లో ఈ మార్గం ఊసే లేదు. ఈస్టర్న్ రైల్వే పరిధిలోని మల్కన్‌గిరి సెక్షన్‌లో జరిగే పనులకే రైల్వేశాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. అలాగే కొత్తగూడెం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని కిరోండల్‌కు సంబంధించి కూడా ప్రస్తుత బడ్జెట్‌లో ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో మొండిచేయి

- అంచనాలు రూ.కోట్లలో.. కేటాయింపులు రూ.లక్షల్లో
- మణుగూరు – రామగుండం లైన్‌పై శీతకన్ను
- పత్తాలేని మల్కన్‌గిరి – కిరండోల్ మార్గాలు
- కొవ్వూరు, కొండపల్లి లైన్లకూ అరకొర విదిలింపులే..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 2025 – 26 రైల్వేబడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయే ఎదురైంది. గత మార్చిలో బడ్జెట్ ప్రకటించగా కేటాయింపులకు సంబంధించిన పింక్‌బుక్ వివరాలు ఇటీవల వెల్లడయ్యాయి. ప్రతీ ప్రాజెక్టుకు అంచనా వ్యయం రూ.కోట్లలో ఉంటే కేటాయింపులు మాత్రం రూ.లక్షలకే పరిమితమయ్యాయి.

నామ్‌కే వాస్తే నిధులు..

భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైల్వే లైన్ నిడివి 151 కి.మీ. ఈ మార్గంలో రైల్వేలైన్ నిర్మించాలని మూడు దశాబ్దాలుగా పోరాటాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు ప్రస్తుత బడ్జెట్‌లో ఆమోదం లభించినా నిధుల కేటాయింపు అంతంతగానే మారింది. ఈ మార్గంలో ట్రాక్ నిర్మాణానికి రూ.1,444 కోట్లు అవసరం కాగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 95 లక్షలు కేటాయించారు. ఈ లైన్‌తో పాటు కొత్తగా భద్రాచలం (పాండురంగాపురం) – మల్కన్‌గిరి, కిరండోల్ – కొత్తగూడెం, మణుగూరు – రామగుండం రైల్వే లైన్ల నిర్మాణానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన రైల్వే శాఖ.. ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ మార్గాలకు కూడా ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశలు అడియాశలే అయ్యాయి.

మణుగూరుకు మొండిచేయి..

మణుగూరు – రామగుండం రైల్వే లైన్ నిడివి 200 కి.మీ. కాగా నిర్మాణ వ్యయం రూ.2,911 కోట్లుగా అంచనా వేశారు. ఈ లైన్‌కు ప్రస్తుత బడ్జెట్‌లో కంటితుడుపు చర్యగా కేవలం రూ.73 లక్షలు కేటాయించారు. రామగుండం సమీపంలోని రాఘవాపురం వద్ద మొదలయ్యే ఈ రైలు మార్గం మంథని – భూపాలపల్లి – మేడారం – తాడ్వాయి – రామానుజపురం మీదుగా మణుగూరు వరకు నిర్మించాల్సి ఉంది. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ ట్రాక్ నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ కూడా చివరి దశకు చేరుకుంది. దీంతో ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతుందనే అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్టుకూ రిక్తహస్తమే ఎదురైంది.

పేరుకే నిధులు..

భద్రాచలం రోడ్ మీదుగా సర్వే నిర్వహించిన రైల్వే లైన్లలో ఒకటైన కొండపల్లి – కొత్తగూడెం (125 కి.మీ) రైల్వేలైన్ నిర్మాణ అంచనా వ్యయం రూ.997 కోట్లు కాగా ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.10 లక్షలు కేటాయించారు. డోర్నకల్ నుంచి భద్రాచలంరోడ్ వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ లైన్‌ను డబ్లింగ్ చేసేందుకు రూ.770 కోట్లు అవసరం అవుతుండగా ఈ బడ్జెట్‌లో కేటాయింపులేమీ చూపలేదు. అయితే సింగరేణి (కారేపల్లి) మండల పరిధిలో పోచారం, గాంధీపురం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి దాదాపు రూ.50 కోట్ల నిధులు కేటాయించారు.

కొత్త రైల్వే లైన్	నిర్మాణ వ్యయం	బడ్జెట్ కేటాయింపులు
భద్రాచలంరోడ్ – కొవ్వూరు	రూ.1,444 కోట్లు	రూ. 95 లక్షలు
కొత్తగూడెం – కొండపల్లి	రూ. 997 కోట్లు	రూ.10 లక్షలు
మణుగూరు – రామగుండం	రూ. 2,911 కోట్లు	రూ.73 లక్షలు
భద్రాచలంరోడ్ – డోర్నకల్ (డబ్లింగ్)	రూ. 770 కోట్లు	కేటాయింపుల్లేవు

స్వర్ణోత్సవాల లోగో ఆవిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం) : మందమర్రి ఏరియాలో సింగరేణి పాఠశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో స్వర్ణోత్సవాల లోగోను సీఎండీ ఎన్. బలరామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందమర్రిలో 1975లో పాఠశాల ఏర్పాటు చేశామని, ఈజూన్‌తో 50 ఏళ్లు పూర్తవుతుందని తెలిపారు. ఈ పాఠశాలలో సంవత్సరానికి 300 మంది చొప్పున విద్యార్థులు చదువు పూర్తి చేసుకొని బయటకి వెళ్తున్నారని, వారంతా నేడు వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో ఉన్నత హోదాల్లో పనిచేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న సీఎండీ తదితరులు

ఇద్దరు పీఏసీఎస్ సిబ్బందిపై వేటు

చండ్రుగొండ : ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని ఇద్దరు పీఏసీఎస్ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. 'డబ్బులిస్తేనే ధాన్యం దిగుమతి' శీర్షికన సాక్షిలో బుధవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతోపాటు పాల్వంచ మండలం సోమలగూడెం లోనూ ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో చండ్రుగొండ మండలం తుంగారం, పాల్వంచ మండలం సోములగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాల పీఏసీఎస్ ఇన్‌చార్జ్‌లపై సస్పెన్షన్ వేటు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటాడుకుందామా..!



ఫుట్‌బాల్ శిక్షణ పొందుతున్న చిన్నారులు

- జిల్లా వ్యాప్తంగా 30 క్రీడాంశాల్లో శిక్షణ
- ఉత్సాహంగా హాజరవుతున్న విద్యార్థులు

ఇల్లెందు: చిన్నారులు వేసవి సెలవుల్లో ఆటపాటలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో జిల్లా క్రీడా శాఖ, సింగరేణి సౌజన్యంతో పట్టణంలోని 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో 30 రోజుల పాటు 14 ఏళ్ల లోపు చిన్నారులకు ఫుట్‌బాల్ క్రీడలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 అంశాల్లో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తుండగా, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఇందులో అథ్లెటిక్స్‌లో, ఫుట్‌బాల్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, చెస్, లాన్ టెన్నిస్, హాకీ, బాక్సింగ్, రైఫిల్ షూటింగ్, తైక్వాండో, ఉషు, సాఫ్ట్‌బాల్, రెజ్లింగ్, యోగా, కరాటే, ఆట్య పాట్య, బాస్కెట్ బాల్ శిబిరాలు కొనసాగుతున్నాయి.

ఇల్లెందులో ఫుట్‌బాల్..

ఇల్లెందులో కోచ్ కె. రాకేష్ నేతృత్వంలో 60 మంది చిన్నారులకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 25 మందికి సింగరేణి ఆధ్వర్యంలో, 35 మంది జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో అందరికీ కలిపి ఒకే చోట నేర్పిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు శిక్షణ ఇస్తుండగా సింగరేణి సంస్థ ద్వారా కోడిగుడ్డు, అరటి పండు, తాగునీరు, టీ సదుపాయం కల్పిస్తున్నారు. 30 రోజుల పాటు సాగే ఈ శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు అటు సింగరేణి, ఇటు జిల్లా క్రీడల శాఖ అధికారులు సర్టిఫికెట్లు అందిస్తారు.

ఆసక్తి చూపుతున్న చిన్నారులు..

చిన్నారుల అభిరుచికి తగ్గట్టుగా ప్రభుత్వం ఆయా క్రీడలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుండడంతో పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇల్లెందు, మణుగూరు, రామవరంలో ఫుట్‌బాల్ శిక్షణ ఇస్తుండగా కొత్తగూడెంలోని రామవరం 3 ఇంక్లైన్ గ్రౌండ్‌లో కుస్తీ(మల్లయుద్ధం) రెజ్లింగ్, భద్రాచలం జూనియర్ కళాశాల, కొత్తగూడెం బాబూక్యాంప్‌లో అథ్లెటిక్స్, కొత్తగూడెంలోని ఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీలో హాకీ, రైఫిల్ షూటింగ్, దమ్మపేట మండలం నాగుపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో ఆట్య పట్య, టేబుల్ టెన్నిస్, రుద్రంపూర్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్, చుంచుపల్లిలో యోగా, రామవరంలో బాక్సింగ్, కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఉషు పోటీల్లో శిక్షణ ఇస్తున్నారు.

ఉల్లాసంగా ఉంది..

ఫుట్‌బాల్‌లో శిక్షణకు వస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంది. ఫుట్‌బాల్ ఆట అంటే ఎంతో ఇష్టం. వేసవి సెలవుల్లో రోజూ రెండు పూటలు ఆడుకునే అవకాశం దొరికింది. – దేవాన్ష్, ఇల్లెందు

బాగా నేర్చుకుంటున్నా..

ఫుట్‌బాల్ ఎలా ఆడాలనేది మంచిగా నేర్చుకుంటున్నాం. ఈ శిక్షణ చాలా బాగుంది. రానున్న కాలంలో మరింత పట్టుదలతో ఆడి ఈ ఆటలో రాణించాలని ఉంది. –దినేష్, ఇల్లెందు

కమనీయం.. రామయ్య కల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తొలుత తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కనులపండువగా దొంగల దోపు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దొంగల దోపు వేడుక కనులపండువగా సాగింది. ముందుగా ఆలయంలో వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మహిళా భక్తుల కోలాటాల నడుమ ఆలయం నుంచి గోదావరి తీరానికి స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ తర్వాత నదిలో తెప్పోత్సవం గావించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి జల విహారంలో అర్చకులు, ఈఓ

సర్కారు స్కూళ్లలో అడ్మిషన్లు పెంచాలి

ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచన

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఉత్తమ బోధన అందిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ఈ తరగతులు ఉపకరిస్తాయని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతి గదుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, మౌలిక భాష, గణిత అభివృద్ధి కార్యక్రమాలను ఏఐ ఆధారంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైన వివరాలు డీఈఓకు తెలియజేస్తే పనులు చేపడతామని చెప్పారు. ఉపాధ్యాయులు శక్తివంతులని, పిల్లలకు నాణ్యమైన విద్యనందించడం వారికే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పక్కన డీఈఓ తదితరులు

సకాలంలో పాఠ్యపుస్తకాలు..

పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందిస్తామని కలెక్టర్ పాటిల్ చెప్పారు. కొత్తగూడెంలోని పాఠ్యపుస్తకాల గోడౌన్‌ను పరిశీలించాక మాట్లాడారు. ఇప్పటికే 70 శాతం పుస్తకాలు జిల్లాకు చేరాయని, మిగిలినవి ఈనెల 25 లోపు వస్తాయని, ఆ వెంటనే మండలాలకు సరఫరా చేస్తామని తెలిపారు. అక్కడి నుంచి పాఠశాలల ఉపాధ్యాయులు తీసుకెళ్లాలని సూచించారు.

ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టాలి

సుజాతనగర్: ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టాలని, అందుకోసం ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతను నిర్మించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా సర్వారం గ్రామ పంచాయతీ, హలావత్ తండాలో పలువురు నిరిస్తున్న ఇంకుడుగుంతల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పలుగు పార పట్టి ఇంకుడు గుంత తవ్వారు. అనంతరం మాట్లాడుతూ.. ఇంకుడు గుంతల నిర్మాణానికి వేసవి కాలమే సరైన సమయమని అన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలతో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయని తెలిపారు. పనులు ఎలా సాగుతున్నాయంటూ పంచాయతీ కార్యదర్శి సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలకు ముందుకొచ్చిన యువకులను కలెక్టర్ అభినందించారు.



ఇంకుడుగుంత నిర్మాణానికి మట్టి తీస్తున్న కలెక్టర్



వికసించిన మే పుష్పం..

ప్రకృతి ప్రియులను అమితంగా ఆకర్షించే మే పుష్పం వికసించింది. మణుగూరు ఆదర్శనగర్‌కు చెందిన లారీ యూనియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేరెడ్డి సురేందర్‌రెడ్డి ఇంట్లో బుధవారం ఈ పుష్పం వికసించడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. – మణుగూరు టౌన్

సన్నాలకే జై..

- బోనస్ నేపథ్యాన రైతుల మొగ్గు
- విదేశీ ఎగుమతులకూ ఇవే సరి
- డిమాండ్ ఆధారంగా విత్తనాలు అందుబాటులోకి...

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వరి కాగా.. రైతులు కొన్నేళ్ల క్రితం వరకు ఎక్కువగా దొడ్డు రకాలనే సాగు చేసేవారు. కొందరు మాత్రమే సన్న రకాలకు మొగ్గు చూపేవారు. సన్న రకాల కన్నా దొడ్డు రకాలు కొంతమేర అధిక దిగుబడి ఇవ్వడం, ధరలో పెద్ద తేడా లేకపోవడం, త్వరగా చేతికి రావడం ఇందుకు కారణమయ్యేది. కానీ కాలక్రమంలో సన్న రకాలకు డిమాండ్ పెరగడం, ధర ఎక్కువగా ఉండడంతో రైతులు ఇటువైపు దృష్టి సారిస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుండడం.. నీటి వసతి పెరగడంతో గత ఏడాది ఖరీఫ్, యాసంగిలో రైతులు ఎక్కువగా సన్న రకాలే సాగు చేశారు. అంతేకాక వచ్చే ఖరీఫ్‌లోనూ అటే మొగ్గు చూపుతుండడంతో విత్తనాభివృద్ధి సంస్థ, ప్రైవేట్ వ్యాపారులు ఆయా రకాల విత్తనాలు సిద్ధం చేస్తున్నారు.

విదేశీ ఎగుమతులకు ప్రాధాన్యత

తెలంగాణలోని పలు జిల్లాల్లో సాగయ్యే వరికి విదేశాల్లో డిమాండ్ ఉంది. ఇప్పటికే ఫిలిప్పీన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాం, ఇండోనేషియా దేశాలతోనూ ఒప్పందం కుదిరే అవకాశమున్నందున ఎగుమతికి అనువైన రకాలను సాగు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా రకాలను సుమారు 2.50 లక్షల ఎకరాల్లో సాగు చేయించాలనేది లక్ష్యం కాగా, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

దొడ్డు రకాలకు చెల్లుచీటీ?

వరిలో దొడ్డు రకాలకు కాలం చెల్లినట్లేనని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇస్తుండడమే కాక రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు కూడా ఇదే బియ్యం సరఫరా చేస్తున్న నేపథ్యాన రైతులు సన్న రకాలే సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఈనేపథ్యాన తక్కువ కాలపరిమితి కలిగి, అధిక దిగుబడి ఇచ్చే దొడ్డు రకాలైన ఎంటీయూ 1001 తదితరాల సాగు గణనీయంగా తగ్గుముఖం పడుతోంది.

అందుబాటులో అనేక రకాలు

ప్రభుత్వ లక్ష్యం, రైతులకు బోనస్, ధర లభిస్తున్న నేపథ్యాన సన్నరకాల విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడంపై యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో సన్న రకానికి సంబంధించి ఎక్కువగా బీపీటీ 5204(సాంబమసూరి) సాగు చేస్తారు. ఇది కాక వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అనేక రకాల విత్తనాలను ప్రవేశపెట్టగా, ప్రైవేట్ కంపెనీలూ విక్రయిస్తున్నాయి. ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ, తెలంగాణ సోనా, వరంగల్ సోనా, పూజ, చింటు, జిలకర సన్నాలు, జగిత్యాల సాంబ, నెల్లూరు సాంబ, ఐఆర్ 64, ఎంటీయూ 1010, వరంగల్ కాటన్ దొర సన్నాలు, సురేఖ, మసూరి వంటి రకాలు అందుబాటులోకి వచ్చాయి.


విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధం

ఖమ్మం జిల్లాలో 3లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. మెజార్టీ రైతులు సన్నాలపై మొగ్గు చూపుతున్నందున తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్‌లో బీపీటీ 5204 రకం 3,400 క్వింటాళ్లు, కేఎన్ఎం 1638 రకం 200 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేశారు. ఏటా వ్యవసాయ శాఖ ఇచ్చే ఇండెంట్ ఆధారంగా విత్తనాలు సమకూరుస్తుండగా, ఈసారి పూర్తిగా సన్న రకాలే అందుబాటులో ఉంచాలని సూచించినట్లు తెలిసింది. దీంతో మిగతా విత్తనాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. బీపీటీ 5204 వంటి రకాలు 25 కిలోల బస్తా విత్తనాలు ధర రూ.1,075 ఉండగా, ప్రైవేట్ కంపెనీలవైతే డిమాండ్ ఆధారంగా రూ.1,200 వరకు ఉంటోంది.



ప్రైవేట్ గోదాంలో సిద్ధంగా సన్న రకాల విత్తనాలు

త్వరలోనే సరఫరా



ప్రభుత్వం నిర్దేశించిన సన్న వరి రకాల విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఇప్పటికే బీపీటీ 5204(సాంబ మసూరి), కేఎన్ఎం 1638 విత్తనాలు ఉన్నాయి. ఇంకొన్ని త్వరలోనే జిల్లాకు చేరుకుంటాయి. ఆపై పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తాం.

– ఎస్.బిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ

క్లుప్తంగా

అంగన్‌వాడీ సిబ్బంది సేవలు ప్రశంసనీయం



సన్మాన గ్రహీతలతో ఐసీడీఎస్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయినుల సేవలు ప్రశంసనీయమని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సీడీపీఓ కనకదుర్గ, హెడ్‌మాస్టర్ మేకల జ్యోతి రాణి, రేగళ్ల అంగన్‌వాడీ టీచర్ రమాదేవిలను ఐసీడీఎస్ లక్ష్మీదేవిపల్లి సెక్టార్ -1 ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడారు. పాల్వంచ సీడీపీఓ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ ఓ.రమాదేవి, అంగన్వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు

సత్తుపల్లిరూరల్: సాగు చేసే పంటలు, భూసారం ఆధారంగా అధికారులు, శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువులు ఉపయోగించాలని, అంతకు మించి వాడితే ఫలితం ఉండకపోగా ఖర్చు పెరుగుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గంగారం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట మార్పిడి చేయడంతో పాటు పంట అవశేషాలను కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు.

సెల్ ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 150 ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బుధవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందుకున్న ఫిర్యాదులతో గత రెండు నెలల వ్యవధిలో పోగొట్టుకున్న 150 మంది ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. గడిచిన ఐదు నెలల్లో మొత్తం 743 మొబైల్ ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందించామన్నారు. రికవరీ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రాము, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీ గ్రామ శివారులో ఓ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. రూ.3100 నగదు, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని బాలరాజుగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. దమ్మపేట, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారయ్యాడు. రూ.17,500 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు. కాగా పేకాటరాయుళ్లలో మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కూడా ఉన్నాడు.

సీఐల బదిలీ, పోస్టింగ్

ఖమ్మం క్రైం: పోలీసు శాఖలోని మల్టీజోన్-1 పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా కరీంనగర్ పీటీసీలో ఆన్ డ్యూటీపై ఉన్న జి.శ్రీకాంత్‌గౌడ్‌ను ఖమ్మం ట్రాఫిక్ సీఐగా కేటాయించారు. అలాగే, ఖమ్మం టాస్క్‌ఫోర్ సీఐగా వెయింటింగ్‌లో ఉన బి.బాలాజీని నియమించారు. అంతేకాకుండా కొత్తగూడెం టుటౌన్ సీఐగా వెయిటింగ్‌లో ఉన్న డి.ప్రతాప్‌ను నియమించారు. ఈ స్థానంలో ఉన్న టి.రమేష్‌కుమార్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

భూసార పరీక్షలేవి..?

పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు

- విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం
- పంట భూముల్లో క్షీణిస్తున్న సమతుల్యత



భూసార పరీక్షకు సేకరించిన మట్టి (ఫైల్)

బూర్గంపాడు: విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వినియోగంతో వ్యవసాయ భూముల సమతుల్యత దెబ్బతింటోంది. ఎరువులతో పాటు గడ్డిమందు వినియోగం పెరిగిపోవటంతో భూములకు మేలు చేసే జంతుజాలం నశిస్తోంది. అధిక దిగుబడుల కోసం ఎరువులు, పురుగుమందుల వినియోగం ఏటికేడు పెరిగిపోతుండగా, ఇప్పటికే భూమిలో ఉండాల్సిన పోషకాలు, సూక్ష్మ పోషకాలు తగ్గిపోతున్నాయి. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం తగ్గటంతో భూముల ఆరోగ్యం క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలు నిర్వహించి నేలలోని ధాతులోపాలు గుర్తించి, అందుకు అనుగుణంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే నాలుగేళ్లుగా జిల్లాలో వ్యవసాయశాఖ భూసార పరీక్షలు నిర్వహించడంలేదు.

జిల్లాలో రెండు కేంద్రాలు..

జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలంలలో భూసార పరీక్ష కేంద్రాలున్నాయి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పర్యవేక్షణలో భూసార పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. రైతుల భూముల నుంచి మట్టిని సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించేవారు. ఫలితాల నివేదిక ఆధారంగా నేలలో ఏఏ ధాతు లోపాలున్నాయి? అందుకు ఏయే ఎరువులు వేసుకోవాలో వ్యవసాయశాఖ అధికారులు వివరించేవారు. ఒక్కో వ్యవసాయ డివిజన్‌లో మండలానికి 250 మట్టి శాంపిల్స్ సేకరించి భూసార పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవటంతో భూసార పరీక్షలు నిలిచిపోయాయి. జిల్లాలో ఏదో ఒక మండలంలోనే ప్రస్తుతం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. అది కూడా మొక్కుబడిగానే సాగుతోంది.

రసాయన మందులతో దెబ్బతింటున్న భూసారం

పూర్వం రైతులు వ్యవసాయ భూముల్లో పశువుల పేడను తోలుకునేవారు. వానాకాలం ఆరంభంలోనే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగులు, పిల్లిపెసర, పెసరను చల్లి నెలరోజుల తర్వాత భూమిని దున్నుకుని పైరు వేసుకునేవారు. ప్రస్తుతం గ్రామాల్లో పశుసంతతి తగ్గిపోయింది. ఒకవేళ పశువుల పేడ అందుబాటులో ఉన్నా దాన్ని పొలాలకు తోలేందుకు ఎక్కువ ఖర్చువుతోంది. దీంతో రైతులు రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడుతున్నారు. అదేసయంలో కలుపు నివారణకు రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. భూములకు మేలు చేసే లక్షలాది సూక్ష్మజీవరాశులు నశిస్తున్నాయి. దీంతో భూమి నిస్సారంగా మారుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు పండని పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో వేసవికాలం రైతు చైతన్య యాత్రలు చేపట్టి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం అలాంటి కార్యక్రమాలు ఏవీ కొనసాగటం లేదు. ప్రభుత్వం స్పందించి భూసార పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేయాలని రైతులు కోరుతున్నారు.

భూసార పరీక్షలు చేయటం లేదు



వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలు చేయక పదేళ్లవుతోంది. గ్రామానికి కనీసం పది శాంపిల్స్ తీసుకుని భూసార పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుంది. భూమిలో ఏమి తక్కువైంది, ఏమి వేసుకోవాలో అధికారులు తెలియజేయాలి. ఎరువులు ఎక్కువగా వాడటంతో పురుగులు, తెగుళ్ల పెరుగుతున్నాయి.

–ఆవుల వెంకటేశ్వరరెడ్డి, రైతు, రెడ్డిపాలెం

భారీ వర్షం.. పిడుగుపాటు

- మణుగూరులో తడిసిన ధాన్యం
- బచ్చువారిగూడెంలో గృహోపకరణాలు దగ్ధం



మణుగూరు టౌన్: పగిడేరులో వర్షపు నీటి మడుగులో ధాన్యం రాశులు



అశ్వారావుపేట రూరల్: పిడుగుపడి దెబ్బతిన్న బచ్చువారిగూడెం పంచాయతీ భవనం

అశ్వారావుపేటరూరల్: పలు గ్రామాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతోపాటు భారీ వర్షం కురిసింది. ఓ గ్రామంలో పిడుగుపడటంతో ఇంట్లో ఉండే గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మండల పరిధిలోని బచ్చువారిగూడెం, గుమ్మడవల్లి, కొత్తూరు, మామిళ్లవారిగూడెం, కొత్త మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, తిరుమలకుంట కాలనీతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బచ్చువారిగూడెం పంచాయతీ కార్యాలయ భవనంపై పిడుగుపడింది. దీంతో జీపీ భవనంలో ముందు భాగం కొంతమేర ధ్వంసం కాగా, పైన ఉన్న సోలార్ పరికరాలతోపాటు లోపల ఉన్న స్విచ్ బోర్డులు, వైర్లు మొత్తం కాలిపోయాయి. గ్రామంలోని టీవీలు, ఫ్యాన్లు, బల్బులు, కూలర్లు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. కాగా అశ్వారావుపేట, అచ్యుతాపురం, ఊట్లపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యంపై రైతులు ఉరుకులు, పరుగులతో పట్టాలు కప్పారు.

నీట మునిగిన ధాన్యం

మణుగూరు టౌన్: భారీ వర్షంతో కల్లాల్లోకి వరద నీరు చేరి ధాన్యం తడిసింది. మండలంలో పలు చోట్ల కల్లాల్లో ఎండబోసిన ధాన్యంపై పట్టాలు కప్పినా తడిసిపోవడంతో రైతులు మనోవేదన చెందుతున్నారు. రోడ్లపై వరద నీరు చేరి ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

లారీల కోసం ఎదురుచూపులు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం, బీజీకొత్తూరు, ఆనందాపురం, నెల్లిపాక బంజర ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 వేల బస్తాలు కాంటాలు పెట్టి లారీల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కాంటాలు పెట్టిన ధాన్యం బస్తాలు మిల్లులకు వెళ్లి అక్కడ దిగుమతి అయ్యేవరకు రైతులదే బాధ్యత అని అధికారులు చెబుతున్నారు. మరోవైపు లారీలు సకాలంలో రాకపోవడంతో రైతులు కేంద్రాల్లో నిరీక్షిస్తున్నారు. బస్తాలు తడిస్తే మళ్లీ తిరగబోసి ఆరబెట్టాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి లారీలు పంపించి ధాన్యం మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

కొబ్బరి తోటలో చిరుతపులి సంచారం!

ఆనవాళ్లు లభ్యం కాలేదన్న ఫారెస్టు రేంజర్



కొబ్బరితోటలో పాదముద్రల కోసం పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ఓ కొబ్బరి తోటలో చిరుత పులి సంచరించినట్లు బుధవారం ఉదయం ప్రచారం జరిగింది. దీంతో రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పేటమాలపల్లి నుంచి నందమూరినగర్‌కు వెళ్లే మార్గమధ్యలో జూపల్లి వెంకట రామారావుకు కొబ్బరి తోట ఉంది. తోట వద్దకు వెళ్లిన రైతుకు కొద్ది దూరంలో చిరుత పులి మాదిరిగా ఓ జంతువు కనిపించింది. దీంతో రైతు స్థానికులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ తన సిబ్బందితో కలిసి కొబ్బరి తోటతోపాటు, చుట్టు పక్కల దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు చిరుత పులి పాదముద్రల కోసం విస్తృతంగా గాలించారు. కానీ ఆయా ప్రదేశాల్లో ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. దీంతో చిరుత పులి సంచారంలో వాస్తవం లేదని, పాదముద్రలు, ఇతర ఆధారాలు లభ్యం కాలేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రేంజర్ తెలిపారు.

అయన్నపాలెంలో భూ వివాదం

షెడ్డు నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారుల ప్రయత్నం



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంధ్యారాణి

చంద్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలో భూ వివాదం నెలకొంది. ప్రభుత్వ భూమిలో ఇటీవల నిర్మించిన రేకులషెడ్డును తొలగించేందుకు అధికారులు బుధవారం ప్రయత్నించగా బాధిత కుటుంబాలు అడ్డుకున్నాయి. అయన్నపాలెం గ్రామశివారులో ఎకరన్నర భూమి అదే గ్రామానికి చెందిన బొప్పి నాగరాజు, బొప్పి కాసులు ఆధీనంలో ఉంది. ఆ భూమిలో కొన్నేళ్లుగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. పాత రేకులషెడ్ల తోపాటు కొత్తగా మరో రేకులషెడ్డు వేశారు.ప్రభుత్వ కళాశాల నిర్మాణం కోసం భూసేకరణలో భాగంగా తహసీల్దార్ సంధ్యారాణిసదరు భూమి ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు ఇటీవలే నోటీసులు జారీ చేశారు. తాజాగా పోలీసులతోపాటు రెవెన్యూ సిబ్బంది రేకులషెడ్డు తొలగించేందుకు ప్రయత్నింగా దళిత కుటుంబాలు అడ్డుకున్నాయి. తాతముత్తాల నుంచి ఆ భూమి ఆధారంగా జీవనం సాగిస్తున్నామని ప్రాధేయపడటంతో తహసీల్దార్ సంధ్యారాణి తోపాటు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు.

సెల్ టవరెక్కిన యువకుడు

భూ వివాదంలో న్యాయం చేయాలని నిరసన



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు

జూలూరుపాడు: భూ వివాదంలో న్యాయం చేయాలని ఓ యువకుడు బుధవారం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన మోటపోతుల కుటుంబీకులకు, దేవరకొండ కుటుంబీకుల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం ఉంది. మండల కేంద్రం సమీపంలో తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన 69/ఆ సర్వే నంబర్‌లో ఐదెకరాల వ్యవసాయ భూమి విషయమై ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించాయి. కాగా తమకు కోర్టు స్టే ఆర్డర్ వచ్చిందంటూ బుధవారం మోటపోతుల కుటుంబీకులు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు సిద్ధపడగా, దేవకొండ కుటుంబీకులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని కోర్టు స్టే ఆర్డర్ ఉందని, ఫెన్సింగ్ పనులను అడ్డుకోరాదని దేవరకొండ కుటుంబీకులను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ క్రమంలో మనస్తాపం చెంది దేవరకొండ నరసింహారావు అనే యువకుడు వెంగన్నపాలెంలోని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని నచ్చజెప్పడంతో కిందకు దిగాడు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ తన తాత దేవరకొండ చిన్న బ్రహ్మయ్య పేరున ఉన్న భూమిని మోటపోతుల ఆగయ్యకు కౌలు నిమిత్తం ఇచ్చామని, ఆగయ్య కుటుంబీకులు అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించాడు.

సింగరేణి విజిలెన్స్ అదుపులో పర్సనల్ విభాగం అధికారి?

ఇప్పటికే ఏసీబీ అదుపులో ఒకరు, విజిలెన్స్ అదుపులో ఇద్దరు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మెడికల్ బోర్డ్‌లో అక్రమాలు, అవినీతి వ్యవహారంలో వారం రోజుల క్రితం ఓ ఉద్యోగిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు. ఇటీవల మరో ఇద్దరు ఉద్యోగుల(ఒకరు వర్క్‌షాపు ఉద్యోగి, మరొకరు ఆస్పత్రి ఉద్యోగి)ను సింగరేణి విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా కార్పొరేట్ విభాగంలో మరో పర్సనల్ విభాగం అధికారిని కూడా అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. కాగా మరో రెండు రోజుల్లో ఆస్పత్రిలో ఓ వైద్యాధికారిని కూడా అదుపులోకి తీసుకుని విచారించనున్నట్లు తెలిసింది. మెడికల్ బోర్డ్ విషయంలో యాజమాన్యం కఠినంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు నెలలుగా సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించటం లేదు. దీనివల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నా త్వరలో నిర్వహించబోయే మెడికల్ బోర్డ్‌ను పారదర్శకంగా జరపాలని యాజమాన్యం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇక నుంచైనా మెడికల్ బోర్డులలో అర్హులైన అనారోగ్య బాధితులనే అన్‌ఫిట్ చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఎద్దు

దమ్మపేట: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అంకంపాలెం గ్రామ శివారులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన గిరిజన రైతు కొర్సా పుల్లయ్య అనే వ్యక్తికి చెందిన ఎద్దు అదే గ్రామ శివారులో బుధవారం ఉదయం మేతకు వెళ్లింది. ఈ క్రమంలో తక్కువ ఎత్తులోనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యాదాఘాతానికి గురై మృతి చెందింది. రూ.60 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

ఆటో బోల్తా, ఎనిమిది మందికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

తల్లాడ: తల్లాడ-సత్తుపల్లి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన పలువురు ఆటోలో తల్లాడ మండలం మిట్టపల్లిలో బంధువుల ఇంట కర్మకు హాజరై తిరిగి వెళ్తున్నారు. తల్లాడ మండలం అంజనాపురం వద్ద గేదె అడ్డు రావడంతో ఆటో ముందు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఒక్కసారి బ్రేక్ వేయగా కింద పడ్డాడు. ఆ వెంటనే ఆటో డ్రైవర్ కూడా సడెన్ బ్రేక్ వేయగా బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న గొర్రెముచ్చు అరుణ, మాలోచి ఆరోగ్యమ్మ, గొర్రెముచ్చు మౌనిక, మణెమ్మ, సిరి, జాన్సీ, గుత్తికొండ జ్ఞాన సుందరికి కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. అలాగే, బైక్‌పై వెళ్తున్న మట్టగాని గురుపాదం కూడా గాయపడగా క్షతగాత్రులను 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు: అక్రమంగా ఇసుక తోలకాలు జరుపుతున్న ఆరుగురు వ్యక్తులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బాదావత్ రవికథనం ప్రకారం.. భేతాళపాడు గ్రామ సమీపంలోని పెద్దవాగులోని ఇసుకను మూడు ట్రాక్టర్లలోలోడు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు ఆంగోత్ సక్రు, కోరం నాయయ్య, బల్లెం రంగయ్య, డ్రైవర్లు బానోత్ బిక్కు, బానోత్ నిఖిల్, సోడె వెంకన్నలపై కేసు నమోదు చేశారు.

సైబర్ కేసు నమోదు

దుమ్ముగూడెం: మండలంలోని పైడాకులమడుగు గ్రామానికి చెందిన యువతి అకౌంట్‌లోని నగదు మాయం కావడంపై పోలీసులు బుధవారం సైబర్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ గణేష్ కథనం ప్రకారం... పైడాకులమడుగు గ్రామానికి చెందిన గొంది దీవెనకు లక్ష్మీనగరం ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆ అకౌంట్ నుంచి గతేడాది జనవరి 30న రూ.76 వేల నగదును సైబర్ నేరస్తులు దొంగిలించారు. బాధితురాలు ఇటీవల బ్యాలెన్స్ చెక్ చేసుకోగా ఈ విషయం వెలుగుచూసింది. దీంతో సైబర్ పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ పోలీసులు కేసును స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పశువులు స్వాధీనం



పశువుల వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

ఇల్లెందురూరల్: భారీ కంటైనర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 18 పశువులను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామం నుంచి పశువులను హైదరాబాద్ తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులు హైదరాబాద్‌కు చెందిన మోహిష్ ఖురేషీ, సూర్యాపేటకు చెందిన గుగులోత్ భానుప్రకాష్, బానోత్ లాల్‌సింగ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టుబడిన గోవులను పాల్వంచ గోశాలకు తరలించామని పేర్కొన్నారు.

జేసీబీ, లారీ సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ములకలపల్లి: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వీకే. రామవరం శివారు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో తెల్లవారుజామున దాడులు నిర్వహించి జేసీబీ, లారీని సీజ్ చేశారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని అడవి దున్న మృతి



అడవి దున్న కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ, రైల్వే, వెటర్నరీ అధికారులు

అశ్వాపురం: అశ్వాపురం రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్ 159 పరిధి మండలంలోని జగ్గారం గ్రామంలో షెడ్యూల్-1 జాతికి చెందిన సుమారు ఐదేళ్ల వయసు కలిగిన అడవి దున్న మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ దాటుతూ గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందింది. ఎఫ్‌ఆర్‌ఓ రమేష్, ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పశువైద్యాధికారి రుబీనా ఫర్హీన్ పోస్టుమార్టం నిర్వహించగా, రైల్వే అధికారులు పంచనామా నిర్వహించారు.

పశువుల వాహనం బోల్తా



కరకట్ట మీద నుంచి కింద పడిన వాహనం, పక్కనే పడి ఉన్న పశువులు

భద్రాచలంఅర్బన్: అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న వాహనాన్ని బుధవారం ఉదయం 4 గంటల సమయంలో కరకట్టపై నిలిపి ఉంచగా, ప్రమాదవశాత్తు అక్కడి నుంచి కింద పడింది. ఈ ఘటనలో ఓ ఆవు మృతి చెందింది. మరో ఆవు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు పడిపోయిన వాహనాన్ని లేపి పశువులను రక్షించారు.

యువకుడి మృతదేహం లభ్యం

ఈతకు వెళ్లి కేటీపీఎస్ కాల్వలో గల్లంతు

పాల్వంచ: కేటీపీఎస్ కాల్వలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి గల్లతైన యువకుడి మృతదేహం మంగళవారం అర్ధరాత్రి లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన ప్రైవేట్ టీచర్ గద్దం శ్రీనివాసరావు కుమారుడు మోక్షిత్(17) డిప్లొమా చదివాడు. తన మిత్రుడు పాతకోటి విజయ్‌తో కలిసి వేసవి సెలవులు కావడంతో పాల్వంచలోని మోహన్ వద్దకు సోలార్ ఇన్‌స్టలేషన్ పని నేర్చుకునేందుకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం మోక్షిత్, విజయ్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్‌లు కలిసి కరకవాగు శివారులోని కేటీపీఎస్ కాల్వలో ఈతకు వెళ్లారు. మోక్షిత్ నీట మునిగి గల్లంతవడంతో సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పోలీసులకు దృష్టికి తీసుకెళ్లారు. వారు కేటీపీఎస్ అధికారులతో మాట్లాడి నీటి సరఫరా నిలిపివేసి గాలించగా, మోక్షిత్ మృతదేహం మంగళవారం అర్ధరాత్రి లభ్యమైంది. ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.